సాక్షి రంగారెడ్డి

సోమవారం । 27 । మార్చి । 2023



హామీ ఇచ్చి మాట తప్పిన కేంద్రం

ఎస్సీ వర్గీకరణ బిల్లుకు పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి యాదగిరి డిమాండ్ చేశారు. 8లో▸




నిరంకుశ పాలనపై పోరాటం

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ నిరంకుశ పాలనపై కాంగ్రెస్ పోరాటం చేస్తుందని టీపీసీసీ సభ్యుడు కడెంపల్లి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. 8లో▸



ట్రస్మాను బలోపేతం చేస్తాం

ట్రస్మాను మరింత శక్తివంతంగా మారుస్తామని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్ రావ్ తెలిపారు. 8లో▸



అసంతృప్తి సెగలు

- అధికార పార్టీలో అంతర్గత కుమ్ములాటలు
- మొన్న చేవెళ్ల, కల్వకుర్తి.. నిన్న మహేశ్వరం
- తాజాగా ఎల్బీనగర్ నియోజకవర్గంలో బహిర్గతం
- ఎన్నికల సమయం సమీపిస్తుండడంతో గళం విప్పుతున్న నేతలు
- అయోమయంలో ద్వితీయశ్రేణి కేడర్



సాక్షి, రంగారెడ్డిజిల్లా: అధికార బీఆర్‌ఎస్‌లో అసంతృప్తి జ్వాలలు రగులుతున్నాయి. నిన్న మొన్నటి వరకు నివురుగప్పిన నిప్పులా ఉన్న వర్గ విభేదాలు.. ఎన్నికల గడువు సమీపిస్తున్న వేళ ఒక్కసారిగా బహిర్గతమవుతుండటం ఆ పార్టీ కేడర్‌ను తీవ్ర అయోమయానికి గురి చేస్తోంది. కేడర్ మొత్తాన్ని ఒక్కతాటిపైకి తెచ్చే నేత లేకపోవడం, పార్టీ జిల్లా అధ్యక్షుడు తన నియోజకవర్గం దాటి బయటికి రాకపోవడం, పార్టీలో ఒకరిపై మరొకరు అవినీతి, భూ కబ్జాలపై బహిరంగంగానే ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకుంటుండటం ఇబ్బందికరంగా మారింది. పార్టీ ముఖ్య నేతలే వర్గాలుగా విడిపోయి బహిరంగ విమర్శలకు దిగుతుండడం విస్మయానికి గురిచేస్తోంది. నిన్న మొన్నటి వరకు చేవెళ్ల, కల్వకుర్తి నియోజకవర్గాలకే పరిమితమైన అంతర్గత విభేదాలు తాజాగా మహేశ్వరం, ఎల్బీనగర్‌కు విస్తరించాయి.

ఎల్బీనగర్ సాక్షిగా బహిర్గతం

ఎల్బీనగర్ నియోజకవర్గంలో కొంతకాలంగా ఉన్న అంతర్గత విభేదాలు.. ఫ్లై ఓవర్ ప్రారంభోత్సవ సమయంలో ఒక్కసారిగా తేటతెల్లమయ్యాయి. ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అభ్యర్థి ముద్దగోని రామ్మోహన్‌గౌడ్ సహా పలువురు మాజీ కార్పొరేటర్లు ఇప్పటికే రెండు వర్గాలుగా విడిపోయారు. కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొందిన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆ తర్వాత నియోజకవర్గం అభివృద్ధి పేరుతో ఆ పార్టీని వీడి.. బీఆర్‌ఎస్‌లో చేరారు. అప్పటి వరకు ప్రత్యర్థులుగా ఉన్న ఇద్దరు నేతలు.. ఆ తర్వాతి నుంచి ఒకే పార్టీలో కొనసాగుతూ వస్తున్నారు. నియోజకవర్గం అభివృద్ధి, సంస్థాగతంగా పార్టీ బలోపేతం వంటి అంశాల్లో ఎమ్మెల్యే నిర్ణయమే కీలకంగా మారడంతో ముద్దగోని సైలెంట్ అయ్యారు. ప్రస్తుతం ఎన్నికల గడువు సమీపిస్తుండటంతో మళ్లీ క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. అధిష్టానాన్ని ప్రసన్నం చేసుకునేందుకు ఇటీవల ఎమ్మెల్సీ కవిత (సీబీఐ విచారణ సమయంలో ఆమెకు మద్దతుగా)తో పాటు ఢిల్లీకి కూడా వెళ్లి వచ్చారు. తాజాగా శనివారం ఎల్బీనగర్ ఫ్లై ఓవర్ ప్రారంభోత్సవానికి కేటీఆర్ హాజరయ్యారు. ఇదే సమయంలో చంపాపేట్ మాజీ కార్పొరేటర్ రమణారెడ్డిపై ఎమ్మెల్యే వర్గీయులు దాడికి యత్నించడం, సదరు మాజీ కార్పొరేటర్, ముద్దగోనితో పాటు మరికొంతమంది మాజీ కార్పొరేటర్లు ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా గళం విప్పడంతో విబేధాలు మరోసారి బహిర్గతమయ్యాయి.

మహేశ్వరంలో వరుస తిరుగుబాట్లు

మహేశ్వరం నియోజకవర్గంలోనూ అంతర్గత విభేధాలు భగ్గుమంటున్నాయి. నిన్న మొన్నటి వరకు మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి మంత్రి సబితకి వ్యతిరేకంగా గళం విప్పారు. బహిరంగంగానే విమర్శనాస్త్రాలు సంధించారు. ఇదే సమయంలో బడంగ్‌పేట్ మేయర్ చిగురింత పారిజాత సైతం పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరిపోయారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి సైతం అసంతృప్తితో ఉన్నారు. నియోజకవర్గంలో వరుసగా చోటు చేసుకుంటున్న ఈ పరిణామాలు ఇంకా సమసిపోకముందే..తాజాగా పార్టీ సీనియర్ నేత కొత్త మనోహర్‌రెడ్డి తిరుగుబాటుబావుటాను ఎగరేశారు. రెబల్ అభ్యర్థిగా బరిలోకి దిగనున్నట్లు ప్రకటించారు. నియోజకవర్గంలో చోటు చేసుకుంటున్న ఈ పరిణామాలు పార్టీ కేడర్‌ను అయోమయానికి గురి చేస్తున్నాయి.

చేవెళ్లలో రత్నం వర్సెస్ కాలె..

చేవెళ్ల నియోజకవర్గంలో ఎమ్మెల్యే కాలె యాదయ్య, మాజీ ఎమ్మెల్యే రత్నం మధ్య కొంత కాలంగా పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. గత ఎన్నికల్లో రత్నం కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత ఆయన కూడా అధికార బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఇలా ఇద్దరు అభ్యర్థులు ఒకే పార్టీలో కొనసాగుతున్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ టికెట్‌పై బరిలోకి దిగాలని రత్నం భావిస్తుండగా..ఆయనకు ముందే చెక్ పెట్టాలని ఎమ్మెల్యే కాలె యత్నిస్తున్నారు. ఈ క్రమంలో ఇరువురు రెండు గ్రూపులుగా విడిపోయి ఒకరిపై మరొకరు అవినీతి, భూ కబ్జాలు, వంటి అంశాలపై బహిరంగంగా ఆరోపణలు చేసుకున్నారు. అధిష్టానం ఆదేశాలతో ప్రస్తుతం కొంత సైలెంట్‌గా ఉన్నారు.

కల్వకుర్తిలో ఎమ్మెల్యే వర్సెస్ ఎమ్మెల్సీ

కల్వకుర్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి మధ్య వర్గ విభేదాలు తారా స్థాయికి చేరాయి. పార్టీలోని ద్వితీయ శ్రేణి కేడర్ రెండుగా చీలిపోయింది. అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల విషయంలో ఇద్దరూ పోటీ పడుతున్నారు. ఒకరు ఎస్ అంటే..మరొకరు నో అంటున్నారు. కొన్ని చోట్ల పార్టీ గ్రామ శాఖలు కూడా రెండుగా చీలిపోయాయి. ఒకరు హాజరయ్యే కార్యక్రమాన్ని మరొకరు అడ్డుకుం టున్నారు. ఈ అంతర్గత పోరు ఎక్కడికి దారి తీస్తుందోనని స్థానికంగా చర్చనీయాంశమైంది.



మీర్‌పేట: మాట్లాడుతున్న మంత్రి సబితారెడ్డి, చిత్రంలో ఎమ్మెల్సీ ఎల్.రమణ తదితరులు

దేశానికే ఆదర్శం

- ప్రజలను నేరుగా కలిసేందుకు ఆత్మీయ సమ్మేళనాలు
- మంత్రి సబితారెడ్డి

మీర్‌పేట: ఓట్లు వేసి గెలిపించిన, పార్టీని నిలబెట్టిన ప్రజలను నేరుగా కలుసుకునేందుకే ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రవ్యాప్తంగా ఆత్మీయ సమ్మేళనాలకు శ్రీకారం చుట్టారని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం మీర్‌పేట కార్పొరేషన్‌లో నిర్వహించిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనానికి పార్టీ జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ ఎల్.రమణతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పేద ప్రజల సంతోషమే ముఖ్యమని ఎల్లప్పుడూ చెప్పే ముఖ్యమంత్రి నగరంలోని పలు ప్రాంతాల్లో ఖరీదైన స్థలాల్లో పేదలకు ఇప్పటివరకు లక్ష వరకు బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇచ్చారని గుర్తు చేశారు. సొంత స్థలంలో ఇంటిని నిర్మించుకునేందుకు గృహలక్ష్మి పథకం కింద రూ.3 లక్షలను ప్రభుత్వం అందించనుందని తెలిపారు. దేశంలోనే 24 గంటలు విద్యుత్‌ను అందిస్తున్నది ఒక్క తెలంగాణ రాష్ట్రం మాత్రమేనని అన్నారు.

రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుంది

కేసీఆర్ నాయకత్వంలో దేశంలోనే తెలంగాణ అన్ని రంగాల్లో ముందుందని బీఆర్‌ఎస్ జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ ఎల్.రమణ తెలిపారు. దేశంలోని ప్రతి పౌరుడు, రైతాంగాన్ని చైతన్యం చేయడమే సీఎం లక్ష్యమన్నారు. మీర్‌పేట పార్టీ ప్రధాన కార్యదర్శి జెటావత్ శ్రీనివాస్‌నాయక్ ఆధ్వర్యంలో జరిగిన సమ్మేళనంలో రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, మేయర్ దుర్గాదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, పార్టీ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజలే బలం, బలగం

బడంగ్‌పేట్: నియోజకవర్గంలోని ప్రజల కష్టసుఖాలు తెలుసుకుని.. వాటిని పరిష్కరించేందుకే ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నట్లు విద్యాశాఖమంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. కార్పొరేషన్‌లోని పెద్దబావి మల్లారెడ్డి గార్డెన్‌లో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించిన అనంతరం పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి అధ్యక్షతన జరిగిన సమ్మేళనానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తన బలం, బలగం అంతా మహేశ్వరం నియోజకవర్గ ప్రజలే అని అన్నారు. రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్ వన్‌గా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి కేసీఆర్ తపన పడుతున్నారన్నారు. గతంలో కరెంట్‌లేక ఇబ్బందులు చూశాం ఇప్పుడు 24 గంటల కరెంట్ వస్తోంది.. తాగునీటికి కిలోమీటర్లు వెళ్లాం నేడు చిన్న పల్లెటూరుకు కూడా మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ నీరందిస్తున్నామన్నారు. పింఛన్లు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, రైతుబంధు, దళిత బంధు, కేసీఆర్ కిట్, షీటీమ్స్, లెక్కలేనన్ని ప్రజా సంక్షేమ పథకాలు తీసుకువచ్చి కేసీఆర్ తెలంగాణకు శ్రీరామరక్ష అయ్యారన్నారు. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పెద్దబావి శోభ, భీమిడి స్వప్న, లిక్కి మమత, పి. శ్రీనివాస్‌రెడ్డి, సూర్ణగంటి అర్జున్, సంరెడ్డి స్వప్న, రామిడి కవిత, ముత్యాల లలిత, బొద్రమోని రోహిణి, జెనిగె భారతమ్మ, బోయపల్లి దీపిక, కో ఆప్షన్ సభ్యురాలు గుర్రం ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

షాద్‌నగర్‌లో ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ బస



షాద్‌నగర్‌కు విచ్చేసిన మోహన్ భగవత్

షాద్‌నగర్: ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్‌భగవత్ ఆదివారం రాత్రి షాద్‌నగర్‌లో బస చేశారు. పట్టణంలోని సీఎస్‌కే విల్లాస్‌లో నివసిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్త నాగిళ్లకుమారస్వామి ఇంట్లో బస చేశారు. ఈ సందర్భంగా నాగిళ్లకుమారస్వామి కుటుంబ సభ్యులు మోహన్ భగవత్‌కు ఘన స్వాగతం పలికారు. కర్నూల్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమానికి హాజరైన ఆయన రాత్రి షాద్‌నగర్ పట్టణానికి చేరుకున్నారు. ఆయన రాక సందర్భంగా ఏసీపీ కుశాల్కర్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయం అల్పాహారం చేసి బీదర్‌లో నిర్వహించే కార్యక్రమానికి మోహన్ భగవత్ వెళ్లనున్నారు.

టీ హబ్‌ను సందర్శించిన వెస్ట్రన్ ఆస్ట్రేలియా మంత్రి

మూడు ఒప్పందాలపై సంతకాలు

హఫీజ్‌పేట్: హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీ హబ్‌ను ఆదివారం వెస్టన్ ఆస్ట్రేలియా అత్యవసర సేవల మంత్రి స్టీఫెన్ డాసన్ సందర్శించారు. అధికారులతో సమావేశమై భవన నిర్మాణం, స్టార్టప్‌ల వివరాలు, ఇతర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఇది భారతదేశం యొక్క మార్గదర్శక ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్, ప్రపంచంలోనే అతిపెద్ద ఇన్నోవేషన్ క్యాంపస్‌గా గుర్తింపు పొందిందని టీహబ్ అధికారులు ఆయనకు వివరించారు. సైబర్ సెక్యూరిటీ పరిశోధన ఆవిష్కరణలో వెస్ట్రన్ ఆస్ట్రేలియా ముందంజలో ఉందని స్టీఫెన్ డాసన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో వెస్ట్రన్ ఆస్ట్రేలియా ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ట్రేడ్ కమిషనర్ నషీదా చౌదరి, టీహబ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అనీష్ అంథోని, డేటా సెక్యూరిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సీఈఓ డాక్టర్ శ్రీరామ్‌తో పాటు ఆయా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. కాగా.. సైబర్ సెక్యూరిటీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఎడిత్ కోవాన్ విశ్వవిద్యాలయం మధ్య అవగాహనా ఒప్పందం జరిగింది.

నడకతో ఆరోగ్యం



ఖైరతాబాద్: నడకతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని అవగాహన కల్పిస్తూ కిమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో అవగాహన వాక్ నిర్వహించారు. జలవిహార్ వేదికగా ఆదివారం కిమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో వాక్ ఎ మైల్ టు స్టాప్ క్లాట్ పేరుతో నిర్వహించిన అవగాహన వాక్‌లో సినీనటి మంచు లక్ష్మి, కిమ్స్ హాస్పిటల్స్ గ్రూప్ సీఎండీ డాక్టర్ బొల్లినేని భాస్కరరావు పాల్గొన్నారు. కార్యక్రమంలో కిమ్స్ హాస్పిటల్ కన్సల్టెంట్ వాస్క్యులర్, ఎండోవాస్క్యులర్ సర్జన్ డాక్టర్ నరేంద్రనాథ్ మేడా, యువతీ యువకులు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

కక్ష సాధింపు సరికాదు



మాట్లాడుతున్న ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

- అక్కసుతోనే రాహుల్‌పై అనర్హత వేటు
- భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: దేశం కోసం ప్రాణత్యాగం చేసిన ఇందిరాగాంధీ మనవడు రాహుల్‌గాంధీపై కక్ష సాధింపు చర్యలు సరికాదని భువనగిరి లోక్‌సభ సభ్యుడు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని పోల్కంపల్లి గ్రామంలో ఆదివారం నిర్వహించిన హాత్‌సే హాత్ జోడో యాత్రకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. లోక్‌సభలో అదానీ గురించి పదేపదే నిలదీస్తున్నారనే అక్కసుతో రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేశారని విమర్శించారు. 2009లో ప్రధాని పదవి తీసుకోమని కోరినా కాదని మన్మోహన్‌ని ప్రధాని చేయడానికి సహకరిస్తారని చెప్పిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. పిల్లలకు ఉద్యోగాలు రావాలని సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పూటకో మాట చెప్పి ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. రైతులకు రుణమాఫీ ఇంతవరకు అమలు చేయడం లేదని, అదిగో ఇదిగో ఉద్యోగాల భర్తీ అంటూ ఎనిమిదిన్నరేళ్లుగా మాయ చేస్తున్నారని అన్నారు. నిరుద్యోగులు ఎంతో కష్టపడి గ్రూప్స్ పరీక్షలు రాస్తే ప్రశ్నాపత్రాల లీకేజీతో వారి బతుకులను అయోమయంలోకి నెట్టారన్నారు. అధికార పార్టీకి చెందిన వాళ్లే పేపర్ లీక్ చేశారని, ఒక్కో పేపర్ రూ.10 లక్షలకు అమ్ముకున్నారని ఆరోపించారు. బంగారు తెలంగాణ చేస్తామని చెప్పిన కేసీఆర్ పిల్లలు చచ్చేలా చేస్తున్నారని కోమటిరెడ్డి మండిపడ్డారు. బంగారు తెలంగాణ ఏమో కానీ కేసీఆర్ కుటుంబమే బంగారుమయమైందన్నారు. తాను పదవుల కోసం ఆలోచించే వ్యక్తిని కాదని ప్రజల కోసం కష్టపడే వాడినని పేర్కొన్నారు. ఈసారి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కిసాన్ సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు ముదిరెడ్డి కోదండరెడ్డి, మాజీ ఎంపీపీ మర్రి నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

కుటుంబ పాలనను తరిమికొడదాం

చంచల్‌గూడ: రాష్ట్రంలో కుటుంబ పాలనను తరిమికొట్టేలా ప్రజలు ముందడుగు వేస్తున్నారని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. టీఎస్‌పీఎస్సీ పరీక్ష పత్రం లీక్ వ్యవహారంలో నిరసన తెలిపిన బీజేవైఎం అధ్యక్షుడు భానుప్రకాశ్‌తో పాటు మరికొందరు నాయకులను అరెస్టు చేసి చంచల్‌గూడ జైలు తరలించిన విషయం తెలిసిందే. జైల్లో ఉన్న వారిని ఆదివారం కిషన్‌రెడ్డి పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలను రాష్ట్ర ప్రభుత్వం నాశనం చేసిందన్నారు. ఎన్నో కష్టనష్టాలకోర్చి పోటీ పరీక్ష రాస్తే ఫలితాలు వచ్చే సమయానికి ప్రశ్నపత్రం లీక్ కావడం దురదృష్టకరమన్నారు. ఎన్ని అక్రమాలు జరుగుతున్నా ప్రభుత్వం బాధ్యత తీసుకోవడం లేదన్నారు. కుంభకోణంపై నిరసన తెలిపిన బీజేవైఎం నాయకులను అక్రమంగా అరెస్టు చేసి జైలు తరలించడం అన్యాయమన్నారు. కిషన్‌రెడ్డి వెంట మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి, శ్యామ్‌సుందర్ ఉన్నారు.

డేటా లీక్ సిటీతో లింక్



- తెలుగు రాష్ట్రాల ప్రజల వ్యక్తిగత సమాచారం సైతం చౌర్యం
- నేరగాళ్ల చేతుల్లో బ్యాంకు ఖాతాదారుల వివరాలు
- నగరానికి చెందిన ఓ వ్యక్తి ప్రమేయంపై అనుమానం
- లోతుగా ఆరా తీస్తున్న సైబరాబాద్ పోలీసులు
- త్వరలోనే జస్ట్ డయల్, గూగుల్, పలు కంపెనీలకు నోటీసులు
- సాంకేతిక నిపుణుల సహాయంతో దర్యాప్తు ముమ్మరం
- రక్షణ శాఖ వివరాల తస్కరణపై ఆరా తీసిన ఆర్మీ, ఢిల్లీ పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన డేటా లీక్ కేసు తీగ లాగితే డొంక కదులుతోంది. ఉత్తరాది రాష్ట్రాలతో పాటు హైదరాబాద్‌తోనూ లింకులు ఉన్నట్లు సైబరాబాద్ పోలీసులు గుర్తించారు. రక్షణ శాఖ, టెలికం విభాగం, ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారులు, విద్యార్థులు, గృహిణులు ఇలా.. 138 విభాగాలకు చెందిన 16.8 కోట్ల మంది వ్యక్తిగత వివరాలను చౌర్యం చేసి, విక్రయిస్తున్న ఏడుగురు అంతర్రాష్ట్ర ముఠాను సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. తొలుత నోయిడా, ఢిల్లీ వంటి ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన ప్రజల వ్యక్తిగత సమాచారం మాత్రమే ఉందని పోలీసులు భావించినప్పటికీ.. దర్యాప్తు చేస్తున్న కొద్దీ కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి.

థర్డ్ పార్టీ ఏజెన్సీల నుంచేనా?

డేటాలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన ప్రజల వ్యక్తిగత వివరాలు సైతం ఉన్నట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఇప్పటికే నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న డేటాను సైబరాబాద్‌లోని తెలంగాణ స్టేట్ పోలీసు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ సైబర్ సేఫ్టీ (టీఎస్‌పీసీసీ) ద్వారా పోలీసులు విశ్లేషిస్తున్నారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన బ్యాంకు డెబిట్, క్రెడిట్ కార్డు ఖాతాదారుల వివరాలు తస్కరణకు గురైనట్లు పోలీసులు గుర్తించారు. డెబిట్, క్రెడిట్ కార్డు వివరాలు, పిన్, సీవీవీ నంబర్లతో సహా ఫోన్ నంబర్లు, చిరునామా వంటి సమాచారం ఉన్నట్లు తెలిసింది. డేటా లీక్‌పై హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి ప్రమేయం ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. దీంతో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) లోతుగా ఆరా తీస్తోంది. రక్షణ శాఖకు చెందిన 2.6 లక్షల మంది వ్యక్తిగత వివరాలు సైతం నిందితులు చౌర్యం చేసిన నేపథ్యంలో.. ఆర్మీ విభాగం, ఢిల్లీ పోలీసులు అప్రమత్తమయ్యారు. ఆయా వివరాలను విశ్లేషించేందుకు సంబంధిత విభాగాల ఉన్నతాధికారులు సైబరాబాద్ పోలీసులతో సమావేశమయ్యారు. ప్రభుత్వ విభాగాల నుంచి కాకుండా థర్డ్ పార్టీ ఏజెన్సీల నుంచే ఈ సమాచారం బహిర్గతమై ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

సాంకేతిక నిపుణుల సహాయంతో..

సైబరాబాద్ డీసీపీ కల్మేశ్వర్ శింగేన్వర్ నేతృత్వంలో 9 మంది పోలీసులతో ఏర్పాటైన సిట్.. ఈ కేసును 360 డిగ్రీల కోణంలో దర్యాప్తు చేస్తోంది. డేటా ఎలా లీకైంది? ఎవరెవరికి విక్రయించారు? ఈ డేటాతో ఎలాంటి మోసాలకు పాల్పడుతున్నారు? విదేశాలకు డేటా తరలించారా? వంటి అంశాలను దృష్టిలో పెట్టుకొని కేసును దర్యాప్తు చేస్తున్నట్లు ఓ పోలీసు ఉన్నతాధికారి తెలిపారు. ఈ కేసు పూర్తిగా సాంకేతిక అంశంపైనే ఆధారపడి ఉండటంతో సైబరాబాద్ పోలీసులు సాంకేతిక నిపుణుల సహాయాన్ని తీసుకుంటున్నారు. తస్కరించిన డేటాను నిందితులు జస్ట్ డయల్‌లో డేటా ప్రొవైడర్ల పేర్లతో రూ.2 వేలకు 50 వేల మంది ప్రజల సమాచారాన్ని విక్రయిస్తున్నట్లు పోలీసుల విచారణలో బయటపడింది. దీంతో తొలి దశలో జస్ట్ డయల్, గూగుల్, ఫేస్‌బుక్, వాట్సాప్ కంపెనీలతో పాటు బ్యాంకులు, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల ప్రతినిధులను విచారించాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఈ క్రమంలో త్వరలోనే ఆయా కంపెనీలకు నోటీసులు జారీ చేయనున్నామని ఓ పోలీసు ఉన్నతాధికారి తెలిపారు. గొలుసుకట్టు మార్కెటింగ్ తరహాలో ఉండటంతో అనేక మందికి ఈ కేసుతో సంబంధాలుండే అవకాశం ఉందని, త్వరలోనే మరికొందరిని అరెస్టు చేస్తామని దర్యాప్తు అధికారి ఒకరు తెలిపారు.

టీఎస్‌ఐఐసీకి ఓంకారేశ్వరుడి భూములు

- సానుకూలంగా స్పందించిన దేవాదాయ, ధర్మాదాయ శాఖ

యాచారం: నందివనపర్తి ఓంకారేశ్వరాలయ భూమిని టీఎస్‌ఐఐసీకి అప్పగించడానికి రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ నిర్ణయించింది. నందివనపర్తిలో ఉన్న ఓంకారేశ్వరాలయానికి నందివనపర్తి గ్రామంతో పాటు నస్దిక్‌సింగారం, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో 145 సర్వే నంబర్ నుంచి 230 సర్వే నంబర్ వరకు 1,400 ఎకరాలకు పైగా భూమి ఉంది. ఆయా గ్రామాల్లో ఓంకారేశ్వరాలయానికి చెందిన 1,100 ఎకరాల భూమిని తమకు కేటాయించాలని కొద్ది నెలల క్రితం టీఎస్‌ఐఐసీ రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖకు విన్నవించింది. దేవాదాయ, ధర్మాదాయ శాఖ నుంచి స్పష్టమైన హామీ లభించడంతో ఆలయ భూమి సేకరణ కోసం త్వరలో టీఎస్‌ఐఐసీ అవార్డు జారీ చేయనుంది. అవార్డుకు ముందే ఆలయ భూమిని పూర్తిగా సర్వే చేసి హద్దులు గుర్తించనున్నారు. పరిహారం ధర నిర్ణయం పూర్తి కాగానే డబ్బులను నందివనపర్తి గ్రామంలోని ఎస్‌బీఐలో ఉన్న ఓంకారేశ్వరుడి ఖాతాలో టీఎస్‌ఐఐసీ జమ చేయనుంది.

ఏళ్లుగా కౌలు రైతుల సాగు

నందివనపర్తిలోని ఓంకారేశ్వరాలయానికి చెందిన 80 సర్వే నంబర్లలోని 1,400 ఎకరాల భూమిపై 60 ఏళ్లుగా నందివనపర్తి, నస్దిక్‌సింగారం, కుర్మిద్ద, తాడిపర్తి గ్రామాలకు చెందిన సుమారు 600 మందికి పైగా రైతులు సాగు చేసుకుని జీవనోపాధి పొందుతున్నారు. కౌలు రైతులకు 37 ఏ సర్టిఫికెట్లు కూడా ఉన్నాయి. ఏళ్లుగా దేవాలయానికి కౌలు కూడ చెల్లిస్తున్నారు. ఏళ్లుగా సాగులో లేని భూమిని యోగ్యంగా మార్చుకోవడం కోసం రూ.లక్షల్లో ఖర్చు చేశారు. తాజాగా టీఎస్‌ఐఐసీ ఓంకారేశ్వరాలయ భూములను తీసుకుంటుందని తెలియడంతో వారిలో ఆందోళన వ్యక్తమవుతోంది. కౌలు రైతులు తమకు 37 ఏ సర్టిఫికెట్లు ఉన్నాయని.. కబ్జాలో ఉన్నాం.. తమకే ఆ భూములపై పట్టాదారు, పాసుపుస్తకాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయమై ఆలయ ఈఓ ప్రవీణకుమార్‌ను సంప్రదించగా 1,100 ఎకరాలకు పైగా ఆలయ భూమిని టీఎస్‌ఐఐసీ తీసుకోవడానికి నిర్ణయించినట్లు తెలిపారు. త్వరలో అధికార జీవో వస్తుందన్నారు.

నిరంకుశ పాలనపై పోరాటం



షాద్‌నగర్‌లో ప్రధాని దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్

షాద్‌నగర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ నిరంకుశ పాలనపై కాంగ్రెస్ పోరాటం చేస్తుందని టీపీసీసీ సభ్యుడు కడెంపల్లి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. రాహుల్ గాంధీ లోకసభ సభ్యత్వాన్ని రద్దు చేయడాన్ని నిరసిస్తూ ఆదివారం షాద్‌నగర్‌లో కాంగ్రెస్ నేతలు ప్రధాన మంత్రి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య దేశంలో జాతీయ పార్టీ అధ్యక్షుడిగా పని చేసిన వ్యక్తిపై బీజేపీ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఆరోపించారు. కోర్టు తీర్పు ప్రకటించిన వెంటనే అనర్హత వేటు వేయడం సరికాదన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలందరూ రాహుల్‌గాంధీ వెంటే ఉన్నారని, అవసరం అయితే ఏ త్యాగానికైనా తాము సిద్ధమని అన్నారు. అనర్హత వేటుపై కాంగ్రెస్ పార్టీ న్యాయ పోరాటం చేస్తుందన్నారు. గాంధీ కుటుంబానికి పదవులు ముఖ్యం కాదని, ప్రజా సేవే పరమావధిగా ముందుకు సాగుతోందన్నారు. దేశంలో ఆర్థిక నేరాలకు పాల్పడుతున్న వారి గురించి రాహుల్‌గాంధీ మాట్లాడితే బీజేపీ కక్ష సాధింపు చర్యలకు పాల్పడిందని పేర్కొన్నారు. దేశ సమైఖ్యత కోసం అన్ని వర్గాలను ఏకం చేసేందుకు ఇటీవల రాహుల్ గాంధీ నిర్వహించిన భారత్ జోడో యాత్రకు మంచి స్పందన లభించిందన్నారు. దీన్ని చూసి ఓర్వలేక బీజేపీ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. ప్రజా వ్యతిరేఖ విధానాలకు పాల్పడుతున్న బీజేపీ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని అన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తిరిగి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు దినేష్ సాగర్, మధు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ వైద్య ఉద్యోగిగా జ్యోతి

క్షయ వ్యాధి నివారణకు కృషి చేసినందుకు అవార్డు



అవార్డు అందుకుంటున్న జ్యోతి

ఇబ్రహీంపట్నం: క్షయ రోగులకు ఉత్తమ సేవలందించిన ఇబ్రహీంపట్నం డివిజన్ టీబీహెచ్‌వీ ఉద్యోగి ఎం జ్యోతిని జిల్లాస్థాయి అవార్డు వరించింది. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని కామినేని ఆడిటోరియంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు, జిల్లా టీబీ అధికారి డా. అరుణ కుమారి చేతుల మీదుగా జ్యోతి ఉత్తమ సేవ అవార్డు, ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. క్షయ వ్యాధిగ్రస్తులు త్వరగా కోలుకునేందుకు వైద్య శిబిరాలు నిర్వహించి సేవలు అందించడం, ఈ వ్యాధి నివారణపై అవగాహన కల్పించడంలో ఆమె కీలకపాత్రను పోషించింది.

అవార్డు బాధ్యతను పెంచింది

జిల్లాస్థాయి అవార్డు నా బాధ్యతను మరింత పెంచిందని జ్యోతి అన్నారు. విధి నిర్వహణలో భాగంగా క్షయ వ్యాధిగ్రస్తులకు ఆరోగ్య సూత్రాలు వివరించా. క్రమం తప్పకుండా మందులు వాడితే వ్యాధి సులువుగా నయం అవుతుందన్న వివరించా. అవార్డుకు ఎంపిక చేసిన జిల్లా అధికారులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ధరణికుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గాడ్గె రజక యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జగన్



కృష్ణయ్య చేతుల మీదుగా నియామక పత్రం అందుకుంటున్న జగన్

ఆమనగల్లు: గాడ్గె రజక యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఆమనగల్లుకు చెందిన ఎన్ జగన్‌ను నియమితులయ్యారు. నగరంలోని బీసీ భవన్‌లో ఆదివారం రాష్ట్ర గాడ్గె రజక సంఘం సమావేశం బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర గాడ్గె రజక సంఘం, యువజన సంఘాలకు నూతన సభ్యులను ఎన్నుకున్నారు. జగన్‌కు ఆర్.కృష్ణయ్య నియామకపు పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. రజకుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

రాష్ట్రస్థాయి కుంగ్‌ఫూ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

షాద్‌నగర్: న్యూ పవర్ కుంగ్‌ఫూ అకాడమీ ఆధ్వర్యంలో శనివారం షాద్‌నగర్‌లోని గణేష్ గార్డెన్‌లో రాష్ట్రస్థాయి కుంగ్‌ఫూ, కరాటే పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను పాలమూరు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ పీ విష్ణువర్ధన్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఆత్మరక్షణ కోసం ప్రతి ఒక్కరూ యుద్ధ విద్యలు నేర్చుకోవాలన్నారు. యువతకు చదువు ఎంత ముఖ్యమో యుద్ధ విద్యలు కూడా అంతే ముఖ్యమన్నారు. విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు న్యూపవర్ కుంగ్‌ఫూ అకాడమీ వారు ఈ పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మోహన్ సింగ్, లష్కర్ నాయక్, డాక్టర్ జగన్ చారి తదితరులు పాల్గొన్నారు.

హామీ ఇచ్చి మాట తప్పిన కేంద్రం

- ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి
- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి యాదగిరి



అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

షాద్‌నగర్ రూరల్: ఎస్సీ వర్గీకరణ బిల్లుకు పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఏ యాదగిరి డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో పెట్టాలని డిమాండ్ చేస్తూ ప్రారంభమైన మాదిగల సంగ్రామ పాదయాత్ర ఆదివారం షాద్‌నగర్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా ఎంఎస్‌పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సీ అనంతయ్య ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ.. బీజేపీ నేతలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోపే ఎస్సీ వర్గీకరణకు పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చి మాట తప్పారని మండిపడ్డారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లవుతున్నా నేటికి ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టకపోవడం దారుణమన్నారు. వివిధ రాష్ట్రాల సీఎంలు వర్గీకరణపై ఏకగ్రీవ తీర్మానాలు చేసి పార్లమెంట్‌కు పంపినా కేంద్రం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వర్గీకరణ సాధన కోసం ఏప్రిల్ 4న బెంగళూరు – విజయవాడ జాతీయ రహదారిని దిగ్బంధం చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా కేంద్రం ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాబోవు ఎన్నికల్లో బీజేపీని భూస్థాపితం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు నగేష్, వినోద్, రవి వర్మ, శ్రావణ్‌కుమార్, శ్రీకాంత్, అశోక్, లక్ష్మయ్య, శ్రీను, బుగ్గరాములు, ఆనంద్, పాండు, ఆవుల పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

‘ట్రస్మా’ను బలోపేతం చేస్తాం

రాష్ట్ర అధ్యక్షుడు శేఖర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న శేఖర్‌రావు

ఆమనగల్లు: ట్రస్మా(ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం అసోసియేషన్)ను మరింత శక్తివంతంగా మారుస్తామని ఆ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు ప్రకటించారు. ట్రస్మా బైలాస్‌లో మార్పులు చేర్పులు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఆమనగల్లులోని శ్రీ లక్ష్మి గార్డెన్స్‌లో ఆదివారం ట్రస్మా రాష్ట్రస్థాయి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావ్, ప్రధాన కార్యదర్శి మధుసూదన్, కోశాధికారి రమణారావ్, రాష్ట్ర ప్రతినిదులు, వివిధ జిల్లాల కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు. సమావేశంలో ట్రస్మా బైలాస్‌లో నూతనంగా పొందుపరిచిన అంశాల గురించి చర్చించి ఆమోదించారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్ రావ్ మాట్లాడారు. 20 ఏళ్ల క్రితం ఏర్పడిన ట్రస్మాలో ప్రస్తుతం 32జిల్లాల నుంచి 9వేల బడ్జెట్ పాఠశాలలు సభ్యత్వం కలిగి ఉన్నాయన్నారు. ప్రస్తుతం బడ్జెట్ పాఠశాలలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నాయని ఆయన చెప్పారు. వాటిని కాపాడుకోవడానికి, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. కరోనా లాక్‌డౌన్ కారణంగా అనేక ప్రైవేటు పాఠశాలలు మూతపడ్డాయని, మరికొన్ని మనుగడ కోసం తీవ్రంగా శ్రమిస్తున్నాయన్నారు. బడ్జెట్ పాఠశాలల మనుగడ కోసం ట్రస్మా బైలాస్‌లో మార్పులు చేర్పులు చేసినట్లు ఆయన చెప్పారు. ఎస్ఎస్‌సీ హాల్ టికెట్లను ఆన్‌లైన్‌లో ఉంచడం సరైన నిర్ణయం కాదని, దీనివల్ల అనేక ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని అన్నారు. సమావేశంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బీరప్ప, రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు పరంజ్యోతి, నారాయణరెడ్డి, ఉమామహేశ్వర్, జోసఫ్, సీ అల్లాజీగౌడ్, టీ వెంకటయ్య, సువర్ణ, గోవర్ధన్‌రెడ్డి, ఏ నిరంజన్, శ్రీనివాసులు, జీ శ్రీనివాసులు, మహమూద్, శ్రీనివాస్, కోట్ల వెంకటేశ్, శ్రీనివాస్‌గుప్తా, సంజీవ్‌కుమార్, ఏ శివలింగం, చెన్నయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

ఇబ్రహీంపట్నం: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్ఐ శేఖర్ కథనం మేరకు.. ఎల్మినేడు గ్రామానికి చెందిన పీ సత్తయ్య ఇబ్రహీంపట్నంకు బైక్‌పై బయలుదేరాడు. స్థానిక శాస్త్రా గార్డెన్ మలుపు వద్ద సాగర్ రహదారి నుంచి ఇబ్రహీంపట్నం వైపు వస్తున్న కారు బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో సత్తయ్య తలకు తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రశ్నపత్రాల లీకేజీపై సమగ్ర విచారణ జరిపించాలి

రాజేంద్రనగర్: టీఎస్‌పీఎస్‌సీ ప్రశ్నాపత్రాల లీకేజీపై సమగ్ర విచారణ జరిపించాల, అభ్యర్థులకు పరిహారం ఇవ్వాలని తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల రామకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం రాజేంద్రనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూ. లక్షలు అప్పు చేసి గ్రూప్స్ పరీక్షలకు సిద్ధమయ్యే సమయానికి పేపర్ లీకేజీ వ్యవహారంతో నిరుద్యోగులు నీరుగారి పోయారన్నారు. వీరిని ఆదుకునే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. లీకేజీకి పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లోని ఇంటి దొంగలే కారణమని స్పష్టంగా తెలుస్తుందన్నారు. ఈ ఘటనతో సంబంధం ఉన్న వ్యక్తులు, సంస్థలపై విచారణ చేపట్టాలన్నారు. ఇందుకు పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్, కమిటీ సభ్యులు, నైతిక బాధ్యత వహిస్తూ పదవుల నుంచి తప్పుకోవాలని లేనిపక్షంలో ప్రభుత్వమే వీరిని తొలగించాలని డిమాండ్ చేశారు. రద్దయిన పరీక్షలను తిరిగి నిర్వహించే సందర్భంలో పరీక్ష రాసే అభ్యర్థులకు ఎలాంటి భారం లేకుండా ప్రభుత్వమే అన్ని రకాల బాధ్యతలు తీసుకోవాలని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

బీజేపీ హయాంలోనే దేశాభివృద్ధి

రాజేంద్రనగర్: దేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశ ప్రజల కోసం అనేక విప్లవాత్మకమైన నిర్ణయాలు తీసుకుంటూ వారి అభివృద్ధికి పాటుపడుతున్నారని చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి అన్నారు. ప్రతి నెల చివరి ఆదివారం ఉదయం ప్రధాని నరేంద్రమోదీ నిర్వహించే మనసులో మాట(మన్ కీ బాత్) కార్యక్రమం 99వ ఎపిసోడ్‌ను అత్తాపూర్ డివిజన్ మన్ కీ బాత్ ఇన్‌చార్జి సాయియాదవ్ ఆధ్వర్యంలో స్థానిక బీజేపీ కార్యాలయంలో వీక్షించారు. ఈ సందర్భంగా నారగూడెం మల్లారెడ్డి మాట్లాడుతూ నరేంద్రమోదీ అవయవ దానంపై చేసిన ప్రసంగం దేశ ప్రజలందరినీ ఆకట్టుకుందన్నారు. సోలార్ విద్యుత్ ప్రయోజనాలను ప్రధాని వివరించారన్నారు. వచ్చే నెల ఏప్రిల్ చివరి ఆదివారం 100 ఎపిసోడ్ పూర్తి చేసుకోబోతున్న సందర్భంగా ప్రజలందరు వీక్షించి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కాకుళారం సతీష్, వంశీ, నగేష్, అనూప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు



లారీని ఢీకొన్న బస్సు

కొత్తూరు: ముందు వెళుతున్న లారీని ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో బస్సు డ్రైవర్ రాములు, కండక్టర్ వేణుగోపాల్‌చారికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని తిమ్మాపూర్ శివారులో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ శంకర్ కథనం మేరకు.. వనపర్తి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వనపర్తి నుంచి హైదరాబాద్‌కు బయలుదేరింది. శనివారం రాత్రి తిమ్మాపూర్ శివారులోకి రాగానే అదే మార్గంలో ఐరన్ (ఇనుప చువ్వల)లోడ్‌తో ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్, కండక్టర్‌కు తీవ్ర గాయాలు కాగా పలువురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బీజేపీ కుట్రలను ఎండగడదాం



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు

కొందుర్గు: దేశంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలను ప్రశ్నిస్తున్నందుకే రాహుల్‌గాంధీపై కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ పార్లమెంట్ మాజీ అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి ఆరోపించారు. ఆదివారం మండలంలోని రాంచంద్రాపూర్‌లో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంజిరెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భావి భారత ప్రధాని రాహుల్ గాంధీ పట్ల బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కుట్రలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కార్పొరేట్ సంస్థలకు ప్రధాని మోదీ ప్రభుత్వ రంగ సంస్థలను కట్టబెట్టి దేశ సంపదను దోచి పెడుతున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని పార్లమెంట్‌లో ప్రశ్నించడం వల్లే రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేశారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. సమావేశంలో నాయకులు నర్సింహ, శ్రీనునాయక్, మహేందర్‌రెడ్డి, షబ్బీర్, సయ్యద్ నయూమ్, ఆదిల్, సలీం, హమీద్, బేరాన్, మహ్మద్, రాజేష్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం



వేడుకల్లో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శంషాబాద్ రూరల్: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ ఆర్థికాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని జెడ్పీ చైర్‌పర్సన్ టి.అనితారెడ్డి అన్నారు. జడ్పీటీసీ నీరటి తన్వీరాజు ఆధ్వర్యంలో ఆదివారం పెద్దషాపూర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజ సేవలో మహిళలు చొరవ చూపడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు, యువతుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న పలువురు మహిళలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నీలం, మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, ఎంపీటీసీ సభ్యులు గౌతమి, సంగీత, సరిత, సర్పంచులు బుచ్చమ్మ, కల్పన, నర్సమ్మ, మాధవి, తదితరులు పాల్గొన్నారు.